క్లుప్తంగా

కవాతును విజయవంతం చేయాలి

వేలేరు : మాదిగల ఆత్మగౌరవ కవాతును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి బొడ్డు శాంతిసాగర్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. జూలై 7న ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్‌లో మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఆత్మగౌరవ కవాతు నిర్వహించనున్నట్లు తెలిపారు. మందకృష్ణకు స్వాగతం పలికేందుకు మాదిగలు సిద్ధంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీస్ మండల అధ్యక్షుడు రాజయ్య, ఎంఎస్పీ అధ్యక్షుడు యేసు, నాయకులువ జోగు మల్లయ్య, అక్కల శంకర్, జోగు శంకరయ్య, మోతే రాజు, శ్రీనివాస్, వెంకటయ్య పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

ధర్మసాగర్ : మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్ లో శని, ఆదివారం జరిగే సీపీఐ రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రాజకీయ శిక్షణ తరగతులకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు, సీపీఐ జాతీయ నాయకులు పల్లా వెంకట్ రెడ్డి, తక్కలపల్లి శ్రీనివాసరావు తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు లక్ష్మణ్, జిల్లా సమితి సభ్యులు కొట్టేపాక రవి, మండల కార్యదర్శి కొట్టి వెంకటేష్, జిల్లా నాయకులు బాబు, అంకుష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 15న హనుమకొండలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కలెక్టరేట్, నక్కలగుట్ట, మచిలీబజార్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు, గోపాల్‌పూర్, పెద్దమ్మగడ్డ, యాదవనగర్, మడికొండ టెక్స్‌టైల్స్ పార్కు సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, వరంగల్‌లోని ఏనుమాముల, పోచమ్మమైదాన్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ శంకేశి మల్లికార్జున్ ఒక ప్రకటనలో తెలిపారు.

హసన్‌పర్తి: మరమ్మతుల కారణంగా చింతగట్టు సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 8.30 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. కేసీ క్యాంపు, రామారం, భీమారం, కోమటిపల్లి, భద్రకాళినగర్, చింతగట్టు, ఎర్రగట్టు గుట్ట, కిట్స్ ఏరియా, హసన్‌పర్తి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

రేపటి నుంచి యోగా శిక్షణ శిబిరం

హన్మకొండ అర్బన్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 16 నుంచి హరిత యోగా శిబిరం ఆధ్వర్యంలో హనుమకొండలోని ఏషియన్ శ్రీదేవి మాల్‌లో యోగా శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు యోగా గురువు పోశాల శ్రీనివాస్ తెలిపారు. నెల రోజుల పాటు నిర్వహించనున్న యోగా తరగతులు ప్రతిరోజు ఉదయం 6గంటల నుంచి 7 గంటల వరకు జరుగుతాయని వివరించారు. 15ఏళ్లు నిండిన వారు శిక్షణ తరగతులకు హాజరుకావొచ్చని పేర్కొన్నారు. వివరాలకు 93947 66001 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

హన్మకొండ అర్బన్: 2024 – 25 విద్యా సంవత్సరానికి ఉచిత ప్రత్యేక శిక్షణకు జిల్లాలోని మానసిక దివ్యాంగుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు మల్లికాంబ మనోవికాస కేంద్రం నిర్వాహకురాలు బండ రామలీల ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని బాలసముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రం గత 23 ఏళ్లుగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అనేక మంది మానసిక దివ్యాంగులకు ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, బిహేవియర్ మోడిఫికేషన్ వంటి శిక్షణ అందించి మార్పు తీసుకువచ్చినట్లు వివరించారు. మానసిక దివ్యాంగులకు ఉచిత ప్రత్యేక విద్యతో పాటు రవాణా సౌకర్యం కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారులు ఆటిజం, డౌన్ సిండ్రోమ్ మానసిక దివ్యాంగతను కలిగి ఉండి, సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఫొటోలతో కేంద్రంలోని కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 95022 52206, 80744 65703 నంబర్లలో సంప్రదించాలని రామలీల కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా బండ రామలీల కోరారు.

సర్కారు విద్యపై నమ్మకం కలిగించాలి

- ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- కొనసాగుతున్న బడిబాట
- చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించిన ఉపాధ్యాయులు


విద్యార్థులకు యూనిఫాం, బుక్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు


చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయులు


దామెరలో యూనిఫాం అందజేస్తున్న కృపాకర్‌రెడ్డి



వేలేరు : పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న జెడ్పీటీసీ

ఐనవోలు : విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ప్రభుత్వ విద్యపై నమ్మకం కలిగించే విధంగా ప్రతీ ఉపాధ్యాయులు చైతన్య పర్చాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. మండలంలోని జెడ్పీహెచ్ఎస్, కక్కిరాలపల్లి ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులకు బుక్స్, యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాల కల్పనకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. త్వరలోనే విద్యాకమిషన్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని విజ్ఞప్తి చేశారు. హెచ్ఎం రామకృష్ణ, ఏపీఎం రాజు, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కృష్ణమూర్తి, వీఓ అధ్యక్షులు సుభద్ర, స్వర్ణలత, శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ కమిటీ చైర్మన్ పబ్బతి సత్యనారాయణ, నాయకులు మార్నేని వెంకటేశ్వర్‌రావు, బొల్లెపల్లి మధు, సాంబయ్య, కంజర్ల రమేశ్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు సంపత్, వెంకట్రాం, నర్సయ్య, రాజు, అశోక్ పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం

ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా మండల వ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలల్లో నూతనంగా 1వ తరగతిలో చేరుతున్న విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం చేపట్టారు. ఈ మేరకు హెచ్ఎంలు, ఉపాధ్యాయులు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. వక్తలు అక్షరం విలువ, చదువు గొప్పదనాన్ని చిన్నారులకు వివరించారు.

వేలేరులో..

వేలేరు : మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలు, యూనిఫాంను జెడ్పీటీసీ చాడ సరిత, జీఈసీఓ సునీత శుక్రవారం అందించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని అన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ స్రవంతి, ఎంపీటీసీ బత్తుల జ్యోతి, పాల్గొన్నారు.

దామెరలో..

దామెర : విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తములుగా ఎదగాలని ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పోలం కృపాకర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం యూనిఫాం, పుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు లకావత్ రజేశ్‌కుమార్, ఉపాధ్యాయులు కమలాకర్, నవీన్, ఉమామహేశ్వర్, కవిత, కళావతి, విజయలక్ష్మీ ఉన్నారు. అలాగే కోగిల్వాయిలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు దాస్యం రామానుజం, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ స్వప్న, ఉపాధ్యాయులు శ్రీరామ్, శివారెడ్డి, రాచమల్ల నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

నడికూడ : పౌష్టికాహారంతోనే ఆరోగ్యం లభిస్తుందని డాక్టర్లు రవీందర్, సంధ్యారాణి అన్నారు. శుక్రవారం మండలంలోని నర్సక్కపల్లి అంబేడ్కర్ కాలనీలో గల అంగన్‌వాడీ కేంద్రంలో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ పిల్లలకు, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పుట్టిన పిల్లల నుంచి 6 సంవత్సరాల్లోపు పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని అన్నారు. ఆరోగ్య జాగ్రత్తల గురించి వివరించి, ప్రభుత్వం అందిస్తున్న బాలామృతం ఎంతో ఆరోగ్యకరమైందన్నారు. అలాగే బరువు తక్కువ, శారీరక, మానసిక రుగ్మతలు ఉన్న చిన్నారులను డిస్ట్రిక్‌ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్‌కు పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం కవిత, ఫార్మసిస్ట్ బాబు, అంగన్‌వాడీ టీచర్ కోడెపాక సుప్రియ, ఆయా వనజ పాల్గొన్నారు.

జాతీయస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైన శ్వేత


శ్వేతను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

శాయంపేట : మండలంలోని గోవిందాపూర్ కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల కళాశాల విద్యార్థిని తుత్తుర్ల శ్వేత జాతీయస్థాయి రగ్బి పోటీలకు ఎంపికైనట్లు స్పెషల్ ఆఫీసర్ మాధవి, పీఈటీ వైనాల కావ్య తెలిపారు. ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు హైదరాబాద్‌లోని జింఖానా స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రెండో స్థానంలో నిలిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు పూణేలో జరిగే జాతీయ స్థాయి రగ్బి పోటీల్లో శ్వేత పాల్గొననున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థిని శ్వేతను స్పెషల్ ఆఫీసర్ మాధవి, పీఈటీ కావ్య, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు.

రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి


పందిళ్లను పరిశీలిస్తున్న అధికారులు

ఐనవోలు : తీగజాతి కూరగాయలైన బీర, కాకర, సొరకాయ పంటలను సాగుచేసే రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలని సెంట్రల్ ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ సెంటర్(సీఐపీఎంసీ) జీడిమట్ల హైదరాబాద్ ఎంటమాలజీ, పాథాలజీ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్లు డాక్టర్ శ్వేతా సర్కార్, డాక్టర్ సుధా సూచించారు. శుక్రవారం మండలంలోని పంథిని గ్రామంలో ఉద్యాన శాఖ అధికారి మానసతో కలిసి వారు ఫీల్డ్ విజిట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తీగజాతి విత్తనాలను ట్రైకోడర్మా విరిడితో విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసి నాటుకోవాలని అన్నారు. అదేవిధంగా రసం పీల్చే పురుగులను అరికట్టేందుకు పసుపు, నీలం జిగురు అట్టలను, సోలార్ లైట్ ట్రాప్‌లను అమర్చుకోవాలన్నారు. వేపనూనె 5ఎంఎల్ లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు బాస్క సదానందం, పెసరు భిక్షపతి, దుబ్బల భిక్షపతి, రమేశ్, తుమ్మల రాజాలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చేగువేరా జయంతి


చేగువేరా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

శాయంపేట : ప్రపంచ విప్లవకారుడు చేగువేరా జయంతి ఉత్సవాన్ని మండలంలోని పత్తిపాక గ్రామంలో పూలే యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వికాస్ మాట్లాడుతూ.. అమెరికా దేశంలో దృఢంగా ఉన్న ఆర్థిక తారతమ్యాలు, ఏకస్వామ్య పెట్టుబడిదారి వ్యవస్థ, నూతన వలసవాదం, సామ్రాజ్యవాదంపైన పోరాడిన పోరాట యోధుడు చేగువేరా అని కొనియాడారు. నేటి యువత చేగువేరాను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. పూలే యువజన సంఘం నాయకులు చందు, సాయిమనోజ్, బాలరాజు, సన్నీ, చంద్రకాంత్ పాల్గొన్నారు.

అభాగ్యులకు ఆశ్రయం



దేశాయిపేట: నా అనే వాళ్లు లేని అభాగ్యులను ఓ కార్పొరేటర్ అక్కున చేర్చుకుని ఆపన్న హస్తం అందించి ఆదుకున్న సంఘటన 13వ డివిజన్‌లో చోటు చేసుకుంది. రంజిత్ కుమార్, అతని సోదరి మతిస్థిమితం సరిగా లేని రమాదేవికి కార్పొరేటర్ సురేష్‌కుమార్ జోషి తన సొంత ఖర్చులతో గుడిసె వేయించారు. అలాగే అన్ని విధాలా సహాయం చేస్తానని అక్కాతమ్ముళ్లకు హామీ ఇచ్చారు.

19 నుంచి పీఎన్ఎం శిక్షణ తరగతులు

దామెర : సాంస్కృతిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ప్రజానాట్య మండలి (పీఎన్ఎం) ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు దామెర విజయ్‌కుమార్(కృష్ణ) పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు వరంగల్ గ్రీన్‌సిటీ సమీపంలో సాంస్కృతిక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతంలోని యువతలో దాగిఉన్న కళా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఈ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా పాటలు, కోలాటం, డప్పు, పల్లెకళలు, నృత్య రూపకాలపై శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ఔత్సాహిక కళాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాల కోసం 9849760795 నంబర్‌కు ఫోన్ చేయాలని ఈ సందర్భంగా దామెర విజయ్‌కుమార్ కళాకారులకు సూచించారు.

క్రీడలతో మానసికోల్లాసం


నాకౌట్ మ్యాచ్‌లో గెలిచిన సాక్షి డెస్క్ టీం

నయీంనగర్: నిత్యం ఉరుకులు, పరుగులతో విధులు నిర్వహించే జర్నలిస్టులకు క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని, శారీరక దృఢత్వానికి ఆటలు ఎంతో దోహదపడుతాయని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పోర్ట్స్ మీట్ –2024లో భాగంగా ప్రెస్ క్లబ్‌లో రెండవ రోజు క్యారం, చెస్ పోటీలను వినయ్‌భాస్కర్ శుక్రవారం ప్రారంభించారు. అలాగే, ఆర్ట్స్ కళాశాల మైదానంలో క్రికెట్ పోటీలను కాజీపేట ఏసీపీ తిరుమల్ ప్రారంభించారు. ఆయనకు క్రీడాకారులను ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య పరిచయం చేశారు. అనంతరం జరిగిన మ్యాచ్‌లో ఈస్ట్ డ్రాగన్స్ టీంపై సాక్షి డెస్క్ టీం విజయం సాధించింది. యంగ్ ఎలక్ట్రానిక్స్ వర్సెస్ ఈస్ట్ రాకర్స్ మ్యాచ్ ఆడగా యంగ్ ఎలక్ట్రానిక్స్ గెలిసింది. హనుమకొండ కింగ్స్‌తో ప్రాణహిత జట్టు తలపడగా హనుమకొండ కింగ్స్‌ను విజయం వరించింది. లగాన్ టీమ్, నమస్తే తెలంగాణ డెస్క్ జట్లు ఆడగా లగాన్ టీమ్ విజయం సాధించింది. ప్రెస్ క్లబ్ కోశాధికారి బోళ్ల అమర్, జర్నలిస్ట్ సంఘాల నాయకులు, ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

సమస్యలపై దృష్టి సారించండి


వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్లు

వరంగల్ అర్బన్: డివిజన్లలో కొన్ని నెలలుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై దృష్టి సారించాలని బీఆర్ఎస్ కార్పొరేటర్లు కోరారు. ఈమేరకు గ్రేటర్ వరంగల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను బల్దియా ప్రధాన కార్యాలయంలో శుక్రవారం కలిసి వినతిపత్రాలు అందజేశారు. స్మార్ట్‌సిటీ, జనరల్ ఫండ్, సీఎం ప్రత్యేక నిధులతో చేపట్టిన పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయని, ఆ పనులను వెంటనే మొదలు పెట్టాలని సూచించారు. డివిజన్లలో క్షేత్రస్థాయిలో పర్యటించి, ఆయా విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మరుపల్లి రవి, దిడ్డి కుమారస్వామి, పల్లం పద్మ, బోగి సువర్ణ, బస్వరాజు శిరీషా ఉన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభించండి

హసన్‌పర్తి: 55వ డివిజన్‌లో మంజూరైన అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని కార్పొరేటర్ జక్కుల రజిత కోరారు. ఈమేరకు కమిషనర్ అశ్విని తానాజీ వాకాడేను శుక్రవారం కలిసి విజ్ఞప్తి చేశారు. ఎన్నికల కోడ్ కారణంగా పనులు ఇంకా ప్రారంభం కాలేదని, భీమారం, కోమటిపల్లిలో శ్మశాన వాటికకు నిధులు విడుదలైనట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

సమ్మె విరమించిన హమాలీ కార్మికులు

హన్మకొండ: తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి కొన్ని రోజులుగా చేస్తున్న సమ్మెను హమాలీలు విరమించారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఐరన్, సిమెంట్ అండ్ హార్డ్‌వేర్ షాపు యజమానులు, హమాలీలతో బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ శుక్రవారం జరిపిన చర్చలు ఫలప్రదమయ్యాయి. పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా హమాలీలకు కూలీ రేట్ల పెంపు, గతంలో బస్తాకు కూలి రూ.6 ఉండగా అది ఇప్పుడు రూ.8కి పెంచేందుకు దుకాణ యజమానులు అంగీకరించారు. కార్యక్రమంలో సిమెంట్, ఐరన్ అండ్ హార్డ్‌వేర్ షాపు యజమానులు, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎంజాల మల్లేశం, ట్రేడ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కొమురయ్య, ఉపాధ్యక్షుడు గొంగళ్ల వెంకన్న, కార్యదర్శి సన్నబోయిన రవి, కార్యవర్గ సభ్యులు మల్లేష్, రామ్మూర్తి, కుమారస్వామి, రాములు, కొండయ్య, యాకయ్య, అంజయ్య, రాజు, దేవేందర్ పాల్గొన్నారు.

జంతు వధలో నిబంధనలు పాటించాలి


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఇన్‌స్పెక్టర్ శివకుమార్

రామన్నపేట: జంతు వధలో నిబంధనలు పాటించాలని ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్ సూచించారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న కటిక వాళ్లకు (జంతు వధ చేసే వాళ్లు) పోలీస్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెటర్నరీ అధికారి అనుమతి ఉన్న పశువులను మాత్రమే వధించాలని, వైద్యుడి సర్టిఫికెట్ ఉన్నప్పటికీ ప్రభుత్వ అనుమతి ఉన్న కబేళాల్లోనే వధించాలని సూచించారు. రోడ్లపై, ఇళ్లలో పశువులను వధించడం, మాంసాన్ని విక్రయించడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. శాంతియుత వాతావరణంలో పండుగను నిర్వహించుకోవాలని, ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఇన్‌స్పెక్టర్ అన్నారు.

అన్యాయంగా తొలగించారు

హన్మకొండ చౌరస్తా: 'కొంతమంది వారి స్వార్థానికి, వారి అక్రమాలను కప్పిపుచ్చుకోవడానికి మా ఉద్యోగాలను అన్యాయంగా తొలగించారు' అని మెప్మాలో కమ్యూనిటీ ఆర్గనైజర్లుగా పనిచేస్తున్న ఎస్.సునీత, ఎస్.సుజాత, జీ.రమాదేవి, ఏ.రమ ఆవేదన వ్యక్తం చేశారు. నేరెళ్ల వేణుమాదవ్ కళాప్రాంగణంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. కుంభకోణం చేశామని ఆరోపిస్తూ ఎలాంటి ఆధారాలు లేకుండా మెప్మా పీడీ కృష్ణవేణి తమను ఉద్యోగం నుంచి తొలగించారని వాపోయారు. తాము అక్రమాలకు పాల్పడినట్లు తేలితే ఏ శిక్షకైనా సిద్ధమే అని అన్నారు. నిరాధరణ ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే తమను విధుల్లో తీసుకునే విధంగా ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

క్రైం కార్నర్

ద్విచక్ర వాహనం ఢీ కొని బాలుడికి గాయాలు


గాయపడిన అర్షిత్

పరకాల : ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి అతివేగంగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో చెల్పూరుకు చెందిన అర్షిత్ రావు అనే బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన పరకాల పోలీస్‌స్టేషన్ ఎదుట శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఈ ఘటనలో బాలుడి తండ్రి, తల్లికి స్వల్పగాయాలు అయ్యాయి. వెనుక నుంచి ఢీ కొట్టిన ద్విచక్ర వాహనాదారుడిని స్థానికులు పట్టుకొని పోలీస్‌లకు అప్పగించారు. గాయపడిన బాలుడిని వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలతో ఉన్న బాలుడిని చూసి అతడి తల్లి తల్లడిల్లింది

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న రమక్క

ఎల్కతుర్తి : కడుపునొప్పి భరించలేక ఓ వృద్ధురాలు బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన భీమదేవపల్లి మండలం రంగయ్యపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. రంగయ్యపల్లి గ్రామానికి చెందిన సట్ల రమక్క(77) ఐదు నెలల క్రితం కడుపునొప్పి రావడంతో హనుమకొండలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి వెళ్లింది. వైద్య పరీక్షలు చేసిన వైద్యులు లీవర్ సమీపంలో రాళ్లు వచ్చాయని హైదరాబాద్ ఆస్పత్రిలో చూపించుకోవాలని సూచించారు. దీంతో ఆమె హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చూపించగా ఆపరేషన్ చేస్తే వయస్సు, శరీరం సహకరించదని పైపు ద్వారా రాళ్లు తీసి స్టంట్ వేశారు. నెల తర్వాత పాత స్టంట్ తీసి కొత్త స్టంట్ వేశారు. అయినప్పటికీ కడుపునొప్పి తగ్గలేదు. కడుపు నొప్పితో పాటు కాళ్లమంటలు రావడంతో తట్టుకోలేక మనస్థాపం చెంది గురువారం రాత్రి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతురాలుకి భర్త, నలుగురు కూతుర్లు ఉన్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆత్మకూరు : పిడుగుపాటుకు గురై చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని పెంచికలపేటలో శుక్రవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పెంచికలపేటకు చెందిన గోవిందు రవి (34) గురువారం సాయంత్రం ఏనుమాముల మార్కెట్‌లో విధులు ముగించుకుని బైక్‌పై వస్తుండగా పెంచికలపేట శివారులో పిడుగుపాటుతో అస్వస్థతకు గురి అయ్యాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. కాగా గోవిందు రవి చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కార్మికులు గుర్తింపు కార్డు పొందాలి



హన్మకొండ చౌరస్తా: భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికులు కార్మికశాఖ ద్వారా గుర్తింపు కార్డును కలిగి ఉండాలని, అప్పుడే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ రమేష్‌బాబు సూచించారు. హనుమకొండలోని సుధానగర్‌కు చెందిన కార్మికుడు మామిడాల శివయ్య గతేడాది డిసెంబర్‌లో సహజ మరణం పొందగా, కార్మిక శాఖ ద్వారా సహజ మరణం, దహన సంస్కారాల నిమిత్తం రూ.15వేల విలువగల చెక్కును కలెక్టరేట్‌లోని కార్మికశాఖ కార్యాలయంలో మృతుడి భార్య శారదకు శుక్రవారం అందజేశారు. అలాగే, వివాహ కానుక పథకం ద్వారా రూ.10 వేల చొప్పున ఇద్దరికి చెక్కులు, నిర్మాణ రంగ కార్మికుల పిల్లలకు 18 మందికి ఉపకార వేతనాలు అందజేశారు.